

## 2న డిడిఆర్‌సి సమావేశం

### విచ్చేయనున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డిడిఆర్‌సి) సమావేశం ఆగస్టు రెండో తేదీ శనివారం నిర్వహించనున్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఆగస్టు రెండో తేదీ ఉదయం 10 గంటల నుంచి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, జిల్లా అధికారులు పాల్గొంటారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉపాధి హామీ, ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బి తదితర శాఖలు చేపట్టిన పనుల ప్రగతిపై సమీక్షిస్తారు.

# ఇదేమి వాతావ'రణం'..!

**ఇదేమి కాలం.. అనే రీతిలో వాతావరణంలో అనూహ్య రీతిలో చోటుచేసుకుంటున్న మార్పులు జిల్లాలోని అన్ని తరగతుల ప్రజలనూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వేసవిలో ఎండలు దారెత్తించగా వర్షాకాలంలోనూ ఎక్కువ రోజులు అదే పరిస్థితి కొనసాగుతుండడం అందరినీ హడలెత్తిస్తోంది. వేసవిని తలదన్నేలా ఎండ వేడిమితోపాటు ఉక్కబోత అల్లాడిస్తోంది.**



**వాతావరణంలో అనూహ్య మార్పులతో జనం విలవిల**

**సాగునీరు, ముంపు సమస్యతో తల్లడిల్లుతున్న రైతులు**

**ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి**

**ప్రజాశక్తి - డెస్క్**

ఈసారి రుతుపవనాల ముందస్తు రాకతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని సాగిన ప్రచారంతో రైతులంతా సాగుకు సన్నద్ధమయ్యారు. కాల్వలకు జూన్ ఒకటో తేదీనే నీటిని విడుదల చేసినా దిగువ స్థాయిలో కొన్నిచోట్ల కాల్వల పనులు జరుగుతుండడంతో శివారు ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సీజన్ ప్రారంభంలో చిరుజల్లులు మురిపించినా చినుకు జాడ లేకుండాపోవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు కనీసం దమ్ములు చేయించలేని దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఒక్కసారిగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ఊపిరిపీల్చుకుని సాగు పనులు ముమ్మరం చేశారు. ఒకవిధంగా చెప్పాలంటే రుతుపవనాల ముందస్తు రాకతో ముందసు సాగు సాధ్యమే అనుకున్నా ఎప్పటిలానే వర్షాభావ పరిస్థితులు, సాగునీరందక సాగు పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు నారుమడులు పూర్తి చేసి నాట్లు దశకు చేరుకుని వేస్తున్న తరుణంలో కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలు నాట్లు వేసిన చేలను ముంచెత్తాయి. దీంతో ముంపు బారిన వరిచేల రైతులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి వైపరీత్యం అనేకన్నా పాలకుల వైఫల్యం ఈ సమస్యకు మూలకారణమని చెప్పక తప్పదు. కాల్వల ఆధునికీకరణ పనులను పూర్తిగా అటకెక్కించిన పాలకులు, కనీసం మురుగు డ్రెయిన్లలో చెత్త, గుర్రపుడెక్క వంటివి తొలగించే ప్రయత్నం చేయకుండా వర్షాల సీజన్‌లో హడావుడీ చేయడంతో ముంపు సమస్య తప్పడం లేదని స్పష్టమవుతోంది. గుర్రపుడెక్క తొలగించకుండా కేవలం మందు పిచికారీ చేసి వదిలేయడంతో అది కుళ్లి దిగువకు వెళ్లేసరికి కనీసం రెండు, మూడు రోజులుపైనే పడుతోంది. అదీ ఎక్కడోచోట అడ్డుపడడంతో మురుగునీరు సాఫీగా ప్రవహించే పరిస్థితి లేక పొలాలు రెండు నుంచి మూడు రోజులపాటు నీటిలో నానుతున్నాయి. దాని నుంచి బయటపడ్డాక మళ్లీ ఎండలు దారెత్తిస్తుండడంతో శివారు పొలాలకు సాగునీరందక, ఎండ తీవ్రతకు నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అతివృష్టి, అనావృష్టి ఈ సీజన్‌లో రైతులను ఉక్కిబిక్కిరి చేస్తున్నాయి. ఇదే పరిస్థితి ఆక్వా రంగంలోనూ కన్పిస్తోంది. వర్షాలు కురుస్తున్న సమయంలో ఆక్సిజన్ అందక, ఎండల తీవ్రత వల్ల మరో సమస్యతో ఆక్వా రైతులు తల్లడిల్లుతున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని వరి, ఆక్వా రైతులు వాపోతున్నారు.

ఇక ఎండా కాలాన్ని తలపిస్తున్న ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, చిరువ్యాపారులు విలవిల్లాడుతున్నారు. వర్షాకాలంలోనూ ఎసిలు ఉపయోగించక తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. వాతావరణంలో అనూహ్య మార్పులతో జనం జ్వరాలు, జలుబు, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. తీవ్ర వేడి వల్ల విరోచనాలు వంటి సమస్యలు సైతం జనం ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని క్లినిక్‌లు కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో అనూహ్య మార్పులతో ఇదేమి కాలం అనుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని జనం లబోదిబోమంటున్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

### ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కొనసాగిన సంతకాల సేకరణ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో మూడో రోజు గురువారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 'స్మార్ట్ మీటర్లు వద్దు, పాత మీటర్లు ముద్దు' అనే నినాదం తీసుకుని స్మార్ట్ మీటర్లను బిగిస్తే ప్రజలంతా వ్యతిరేకించండి అని ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆనాడు వైసిపి ప్రభుత్వం చేసుకున్న అదానీ



ఏలూరులో...


చింతలపూడిలో...

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కొనసాగించడం హేయమైన చర్య అని విమర్శించారు. నాడు వైసిపి ప్రభుత్వం చిన్న పరిశ్రమలపై విద్యుత్ సుంకం యూనిట్‌కు ఆరు పైసల నుండి వంద పైసలకు పెంచిందని, నేడు కూటమి ప్రభుత్వం దానిని తగ్గించకుండా అంది కొనసాగించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూఅప్ ఇంధన సర్దుబాటు ఛార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని, ఇప్పటి వరకు వసూలు చేసిన సర్దుబాటు ఛార్జీలను ప్రజలకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఫైర్‌స్టేషన్ వద్ద ప్రారంభమైన సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని జిల్లా పరిషత్, ఇండోర్ స్టేడియం, కోర్టు సెంటర్ మీదుగా తిరిగి ఫైర్‌స్టేషన్ వద్ద ముగించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, పంపన రవికుమార్, కాకి నాని, కె.శ్రీనివాస్, వివిఎన్.ప్రసాద్, జి.శివకుమార్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి:** స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాఘవాపురం పట్టణంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా నాయకులు డి.రంగనాథ్, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు డి.సత్యనారాయణ, దొంతా కృష్ణ, ఎస్‌కె.ఖాలేశా, ఎస్‌కె.మస్తాన్, మోర్తా లక్ష్మణరావు, తాడిగడప మాణిక్యాలరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### పెరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలి

### సమీక్షించిన జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లాలో ఈ నెల 15న 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా నిర్వహించాలన్నారు. వేడుకలు నిర్వహించే పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల నిర్వహణకు వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, విఐపిలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు, శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. దేశభక్తి పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్న తరహాలో అందరినీ ఆకర్షించేలా నిర్వహించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేయటడంతోపాటు వారికి స్నాక్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు, ఆయా శాఖల శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను ప్రతిపాదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ


సమీక్షిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

వి.విశ్వేశ్వరరావు, సిపిఒ వాసుదేవరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పశుసంవర్ధకశాఖ జెడి గోవిందరాజులు, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిపిఒ కె.అనురాధ, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ పి.నాగార్జునరావు, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, తహశీల్దార్ గాయిత్రి, డ్వామా పీడీ కెవి.సుబ్బారావు, ఐసిడిఎస్ పీడీ పి.శారద, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎన్.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, డిఎస్ఒ విలియమ్స్, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తగ్గిన గోదావరి వరద

### ముంపులోనే గుండేటి, ఎద్దు వాగులపై కాజ్‌వేలు

**ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్**

వారం రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ వచ్చిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గింది. గురువారం నాడు భద్రాచలంలో 27 అడుగులకు చేరుకుని క్రమంగా తగ్గుతోంది. గోదావరి వరద తగ్గుతున్న కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపు నుండి బయటపడలేదు. దీంతో వారం రోజులుగా వాగు అవతల ఉన్న 12 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వరద తగ్గుతుండటంతో రెండు రోజుల్లో గుండేటి వాగు కాజ్‌వే వరద ముంపు నుండి బయట పడితే రాకపోకలు కొనసాగే అవకాశం ఉంది.


వేలేరుపాడు రూరల్ : ఎద్దు వాగు దాటుతున్న ప్రజలు

**వేలేరుపాడు రూరల్:** గోదావరి తగ్గుముఖం పట్టడంతో మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే కొయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వేపై ఉన్న వరద తగ్గకపోవడంతో టేకూరు, తాళ్లగొంది, పూచిగొంది, టేకూరు, కాకిసినూరు, కొయిదా కట్కూరు తదితర సుమారు 20 గ్రామాలు వరద చుట్టుముట్టి ఉండటంతో రహదారి సౌకర్యం లేక నానావస్థలు పడుతున్నారు.

## అనుమతులు లేకుండా నారాయణ హైస్కూల్ నిర్వహణ !

### యాజమాన్యంపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

అనుమతి లేకుండా హైస్కూల్ నడుపుతున్న నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ఆర్.పేట మోర్ మార్కెట్ సందులో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం సందర్శించారు. అనుమతి లేకుండా హై స్కూల్ నడుపుతున్నట్లు గుర్తించామని లెనిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అండతోనే నారాయణ విద్యాసంస్థలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. నారాయణ జూనియర్ కళాశాలలో హైస్కూల్ విద్యావ్యవస్థ నడుస్తుందని విద్యాశాఖాధికారులకు తెలుసు అని, అయినా సరే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యాశాఖాధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే రాతపూర్వకంగా అర్జీ ఇస్తే రెండు రోజుల్లో వెళ్లి పరిశీలిస్తానని అధికారులు చెప్పారని తెలిపారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడే బయట నుంచి అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విద్యాశాఖాధికారుల వైఖరి సరి కాదని, వెంటనే జిల్లావ్యాప్తంగా ఉన్న చైతన్య, నారాయణ, కార్పొరేట్ విద్యా సంస్థలను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శివాజీ, సహాయ కార్యదర్శి ఎం.జయంత్, జిల్లా కమిటీ సభ్యులు శివ చరణ్ పాల్గొన్నారు.

**సాంఘిక సంక్షేమ హాస్టళ్లో అధికారుల పర్యవేక్షణ లోపం**

సాంఘిక సంక్షేమ హాస్టళ్లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా అన్ని వసతి గృహాలను సర్వే చేస్తున్నామని, ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్‌లో సర్వే చేశామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడగగా మరుగుదొడ్ల సమస్య ఉందని చెప్పారని, భోజనం సరిగ్గా ఉండటం లేదని తెలిపారని చెప్పారు. హాస్టల్లో సిగరెట్లు, మద్యం తాగేవారు ఎక్కువ శాతం ఉన్నట్లు గుర్తించామని, హాస్టల్ డాబాపైన రాత్రి పది గంటల నుంచి 12 గంటల మధ్యలో హాస్టల్ విద్యార్థులతో పాటు బయట వ్యక్తులు వచ్చి మద్యం తాగుతున్నారని విద్యార్థులు తెలిపారన్నారు. అధికారులు ఈ హాస్టల్ వైపు అసలు చూడటం లేదన్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు తగ్గిపోయాయని, హాస్టల్ మేడ పైకి వెళ్లి చూస్తే సిగరెట్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లు, మద్యం సీసాలు ఉన్నాయన్నారు. పక్కన ఉన్న అంబేద్కర్ భవన్‌పైన కూడా మద్యం సీసాలు ఉన్నాయని, పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఈ రెండు ప్రాంతాల్లో కూర్చొని మద్యం తాగుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంక్షేమ శాఖ అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకుని చెడు మర్గంలో వెళ్తున్న విద్యార్థులపై చర్యలు తీసుకుని మిగతా విద్యార్థుల భవిష్యత్తు నాశనం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఉన్నతాధి కారులు జోక్యం చేసుకోవాలని, లేకపోతే విద్యార్థి సంఘంగా ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివాజీ, జయంత్, శివ సాయి చరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

## 2న అన్నదాతా సుఖీభవ సొమ్ము జమ

**జిల్లాలో 1,51,694 మంది రైతులకు ప్రయోజనం**

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి**

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

ఈ నెల రెండో తేదీన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతులకు రూ.3,174.40 కోట్ల ఆర్థిక సాయం అందుతుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం వివరాలను తెలియజేస్తూ తొలివిడతలో కేంద్రం అందించే రూ.రెండు వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేలు కలిపి మొత్తం రూ.ఏడు వేలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా రెండో విడతలో మరో రూ.ఏడు వేలు, మూడో విడతలో రూ.ఆరు వేలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందుతుందని తెలిపారు. ఈ నగదు జమ వల్ల వేలాది రైతులకు ఉపశమనం కలగనుందన్నారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 1,51,694 మంది రైతులు ప్రయోజనం పొందుతారని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో 33,405 మంది రైతుల ఖాతాలకు సొమ్ము జమకానుందని తెలిపారు.

## ఉద్యోగ విరమణ హెచ్‌ఎంకు సన్మానం

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

మండలంలోని పి.కన్నాపురం జెడ్‌పి హెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాట్రు రామకృష్ణ, రామన్నగూడెం జెడ్‌పి హెచ్ స్కూల్ అసిస్టెంట్ ఇ.శేఖర్‌బాబు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. వీరికి పి.కన్నాపురం పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి హాజరయ్యారు. హెచ్‌ఎం రామకృష్ణను, స్కూల్ అసిస్టెంట్ శేఖర్‌బాబును యుటిఎఫ్ ద్వారకాతిరుమల మండల శాఖ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ముస్తఫాలీ, ఆర్.రవికుమార్, జగన్మోహన్‌రావు, దేవానందరావు, కట్టా శ్రీనివాసరావు, చిన్నబాబు, రాంబాబు, పెద్దిరాజు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


హెచ్‌ఎం దంపతులను సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

## 2న జెడ్‌పి సర్వసభ్య సమావేశం


**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు రెండో తేదీన జెడ్‌పి ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జెడ్‌పి సిఇఒ శ్రీహరి తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, జెడ్‌పిటిసి లు, ఆహ్వానితులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## మురళీకృష్ణకు పిహెచ్‌డి పట్టా

**ప్రజాశక్తి - ఆగిరిపల్లి**

మండల పరిధి లోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న చింతా వెంకటమురళీకృష్ణకు విశాఖపట్నం గీతమ్ (డీమ్డ్ టు బి) యూనివర్శిటీ వారు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసిందని కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు తెలిపారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ జి.అప్పారావు పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ కాన్‌టెక్స్చువల్ సెగ్మెంట్ ఆన్‌ది ఓవర్ ఆల్ రేటింగ్ ఇన్ మల్టీ క్రైటీరియా ట్రావెల్ రికమండర్ సిస్టమ్స్ అనే అంశంపై ఆయన పరిశోధన చేయడంతో పిహెచ్‌డి పట్టా పొందారు. పిహెచ్‌డి పట్టాను ఛైర్మన్ ఆర్.వెంకట్రావు గురువారం వెంకట మురళీకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ డి.కైలాసరావు, డాక్టర్ కెవి.సాంబశివరావు, ఎన్.మాధవరావు, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న మురళీకృష్ణ

## తాగునీటి సమస్య పరిష్కారం

### మిగిలినవాటిని త్వరలో పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ

### సిపిఎం నేతలకు యనమందల ఎస్‌టి కాలనీవాసుల కృతజ్ఞతలు

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

మండల పరిధిలోని యనమందల గ్రామంలోని ఎస్‌టి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు మోటారుకు అధికారులు మరమ్మతులు చేయించారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంటల ఏర్పాటుకు, కాలనీలో ఉన్న రోడ్లకు, డ్రెయిన్‌లకు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ సెక్రటరీని ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ ఆదేశించారు. యనమందల ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నేతలు బుధవారం ఆందోళన చేశారు. అధికారులు దృష్టికి వెళ్లడంతో స్పందించిన వారు ఎస్‌టి కాలనీలో బోరు మోటార్‌కు గురువారం మరమ్మతులు చేయించారు. ఎంపిడిఒ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులు వివరించిన మిగిలిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటి నుంచి వచ్చే మురుగునీరు నిష్క్రమణ కోసం ఇంకుడు గుంతలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన గుంతల సంఖ్యను తెలియజేయమని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే మంజూరు చేసి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఎస్‌టి, ఎస్‌సి కాలనీలకు సీసీ డ్రెయిన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంజూరు ఇచ్చిన వెంటనే మ్యాజిక్ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఎఎన్‌ఎం, ఆశావర్కర్ల సహకారంతో స్టాగ్నటెడ్ వాటర్ (నిల్వ నీరు) ఏర్పడకుండా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తాజాగా యనమదల గ్రామపంచాయతీకి ఒహెచ్ ఎస్ఆర్ ట్యాంక్ కొత్తగా మంజూరైనట్లు చెప్పారు. గ్రామానికి శాశ్వత తాగునీటి పరిష్కారంగా మారుతుందని తెలిపారు. సిపిఎం నేతలకు యనమందల ఎస్‌టి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.


కాలనీలో పర్యటిస్తున్న ఎంపిడిఒ

## నాసా పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

జంగారెడ్డిగూడెం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అమెరికా నాసా వారు నిర్వహించిన స్పేస్ కాలనీ పోటీలో ఉభయగోదావరి జిల్లాల్లోనే ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జంగారెడ్డిగూడెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు హాజరై బహుమతి ప్రదానం చేసి విద్యార్థులను అభినందించారు. డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం లెక్చరర్ ఎన్.రాంబాబు మాట్లాడుతూ అప్‌ల్యాండ్ ఏరియా విద్యార్థులు నాసా స్థాయికి చేరుకోవడం శుభపరిణామమని కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ తమ విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేయడానికి ప్రధాన కారణం తమ స్కూల్ కరిక్యులమ్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎఐ కె.శ్రీనివాస్, డీన్ మహమ్మద్‌ఆలీ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శివ సుబ్రహ్మణ్యం, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ టీచర్ ఎస్.రత్నరాజు, సోషల్ టీచర్ సిహెచ్.శ్రీకాంత్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.


బహుమతులతో విద్యార్థులు

## మద్యం సీసాలు, వ్యర్థాల తొలగింపు

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ముదినేపల్లి అంబేద్కర్ కాలనీలోని ఐదో నెంబర్ అంగన్వాడీ కేంద్రం వద్ద వ్యర్థాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి జి.రమేష్ కార్మికులతో తొలగింపజేశారు. మందుబాబులకు అడ్డాగా అంగన్వాడీ కేంద్రాలు శీర్షికన ఈ నెల 28వ తేదీ సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. అంగన్వాడీ ఆవరణ వద్ద ఎంతో కాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను, మద్యం సీసాలను తొలగించి ఆ ప్రాంతమంతా శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు, అంగన్వాడీ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.



శుభ్రంగా ఉన్న కేంద్ర ప్రాంగణం

## పెదవేగి ఎంఇఒ-1గా త్రిపురసుందరి

**శుభాకాంక్షలు తెలిపిన ఎస్టియు నాయకులు**

**ప్రజాశక్తి - పెదవేగి (దెందులూరు)**

పెదవేగి ఎంఇఒ-1గా బాధ్యతలు స్వీకరించిన బి.త్రిపురసుందరిదేవిని ఎస్టియు పెదవేగి నాగార్జున ఆధ్వర్యంలో ఎస్టియు నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బి.త్రిపురసుందరి మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థ పటిష్టానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంఎల్ఎను, ఎంపిడిఒను, తహశీల్దార్ను, మండల నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎస్టియు సీనియర్ నాయకులు ఎన్.శ్రీను, గుప్త, శ్రీనివాస్, ఎండి షఫీ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టియు నేతలు

## సమస్యలు పరిష్కరించాలని పాస్టర్ల వినతి

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

మండలంలోని పాస్టర్లు, క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం నియోజకవర్గ పాస్టర్ల జెఎసి ఆధ్వర్యంలో మండల పాస్టర్లు గురువారం తహశీల్దార్ టి.సాయిబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ పాస్టర్ల జెఎసి కార్యదర్శి కురసం నిర్మలరావు, మండల కార్యదర్శి బి.కిషోర్, వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.హెర్షియాలు మాట్లాడుతూ మండలంలో పాస్టర్ల సమావేశ మందిరం కోసం స్థలం ఏర్పాటు చేయాలని, అర్హులైన పాస్టర్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. స్థానికంగా చర్చి స్థల వివాదాన్ని పరిష్కరించినందుకు పాస్టర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి కమిటీ సభ్యులు జి.జ్యోతిర్కుమార్, ప్రకాశ్బాబు, యెహోషువ, శ్యామ్ప్రసాద్, అకుల, ప్రసన్నరాజు, జాన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడినవారికి టిడిపిలో సముచిత స్థానం

**ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

బలమైన నాయకత్వంతో, అద్వితీయ విజయాలతో టిడిపి కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. నియోజకవర్గంలో కూటమి గెలుపునకు అహర్నిశలు శ్రమించిన ప్రతిఒక్క నాయకునికి సముచితస్థానం కల్పించి న్యాయం చేస్తామని, సుముచిత స్థానాన్ని కల్పించి గౌరవిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏలూరు టౌన్ రైతుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్గా టిడిపి నాయకులు అమరావతి అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏలూరులోని ఒక ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఛైర్మన్ అమరావతి అశోక్తో పాటు పర్సన్ ఇన్ఛార్జులుగా మేడపల్లి ఏసుబాబు, బుద్దా నాగేశ్వరరావు పేర్లను చదివి వినిపించి వారితో ఎంఎల్ఎ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అశోక్తో పాటు పర్సన్ ఇన్ఛార్జులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి పరిశీలకులు మీరావలీ, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## ఆటోను ఢీకొన్న ఐషర్ వ్యాన్

**కూలీ మృతి, ఆరుగురికి గాయాలు**

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

చేపలు పట్టేందుకు వెళ్తున్న కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఐసర్ వ్యాన్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన కొందరు కూలీలు ఆటోలో మండవల్లి చేపల చెరువుల్లో చేపలు పట్టేందుకు బయలుదేరారు. ఆటో సరిగ్గా ఏలూరు రూరల్ మండలం జాలిపూడి సమీపానికి చేరుకునేసరికి కైకలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ ఎదురుగా వచ్చి కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన సందీప్ బల్సి (23) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. గాయాలపాలైన వారిని స్థానికులు 108లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

మండలంలోని మీర్జాపురంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బిల్లనపల్లి గ్రామానికి చెందిన బందుల స్వామి (20) బైకుపై వస్తుండగా మీర్జాపురం గ్రామంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## మాట వినడం లేదని..

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

కుమారుడు మాట వినడంలేదని, విసిగిస్తున్నాడని ఆగ్రహానికి గురైన తల్లి కర్రతో కొట్టగా కర్ర గట్టిగా తగలడంతో కుమారుడికి గాయమైంది. మండలంలోని రామానుజపురానికి చెందిన తొంట కుమారికి మానసిక, శారీరిక వికలాంగుడైన కుమారుడు శివ ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం శివ చెప్పిన మాట వినడంలేదని, విసిగిస్తున్నాడని ఆగ్రహానికి గురైన తల్లి కర్రతో తలపై కొట్టింది. కర్ర గట్టిగా తగలడంతో శివకు గాయమైంది. స్థానికులు శివను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

మండలంలోని వెలగపాడు పంచాయతీ వీరభద్రవరంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీరభద్రవరం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.43 వేల నగదు, నాలుగు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బిల్లులు లేని ఎరువులు సీజ్

**ప్రజాశక్తి - చింతలపూడి**

ఎరువులు బిల్లులు లేకుండా అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి వ్యవసాయ ఉపసంచాలకులు సుబ్బారావు హెచ్చరించారు. బిల్లులు లేకుండా వ్యాన్ ద్వారా మైలవరం రాంబాబు అనే వ్యక్తి ఎరువులు చింతలపూడికి పంపిస్తుండటంతో లింగపాలెం మండలంలో పట్టుకున్నట్లు తెలిపారు. రూ.2.6 లక్షల విలువైన ఎరువులు సిజ్ చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో లింగపాలెం ఎఒ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## స్వీయ భద్రతపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

విద్యార్థి దశ నుంచే వారికి స్వీయ భద్రతపై కచ్చితమైన అవగాహన కల్పించాలని జిల్లా అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా భద్రత చట్టాలపై స్వీయ భద్రతపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఎస్పి సూర్యచంద్రరావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని వేరొక వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. గుడ్, బ్యాడ్ టచ్పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి శ్రావణ్కుమార్, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్లో ఆరుగురికి ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఇద్దరికి శానిటరీ ఇన్స్పెక్టర్లుగా, నలుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న శనపతి అప్పారావు, బోను రాజులకు శానిటరీ ఇన్స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్న టి.సునీల్, ఎస్కె బాజీ, రికార్డు అసిస్టెంట్గా పనిచేస్తున్న టిఎన్.భూపాల్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్గా పని చేస్తున్న ఎస్కె.నజీర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

## విద్యార్థినికి వీల్చైర్ల అందజేత

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

మండలంలోని శ్రీనివాసపురం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మోటూరి హర్షితకు రెండు కాళ్లు ఉన్నా పనిచేయవు. ఆమెకు జిల్లా స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్, తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు తన సొంత ఖర్చులతో వీల్ చైర్ అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయులు ఇరపా గంగాదేవి అభినందించారు. భారత స్కౌట్స్, గైడ్స్ ద్వారా మరెన్నో సేవలు చేసి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినికి తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటూ చదువుకుంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్తోనే వారు బతుకుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్రావు, రవీంద్రరావు, వెంకట్రావు, ఖండియా, ఇందిర ప్రియదర్శిని లక్ష్మణరావు, రాణి, రాధ, స్వర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'స్వామిత్వ'పై అవగాహన

**ప్రజాశక్తి - ముసునూరు**

సర్వే పై ప్రతి ఒక్క అధికారి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో రెండు రోజుల స్వామిత్వ సర్వేపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయతీ సెక్రటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు, విలేజ్ సర్వేయర్లకు, విఆర్ఒలకు రమణక్కపేట విలేజ్ సర్వేయర్ తిరుమలరావు ద్వారా అవగాహన కల్పించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి వెంకటేశ్వరరావు, కె.సుజాత, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

ముస్లిం నూర్ భాషా దూదేకుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై నూర్ భాషా మండలాధ్యక్షులు షేక్ అలీషా అలియా, సెక్రటరీ మస్తాన్ ఎస్కె, పీరు ఎస్కె, అజీజ్లు హర్షం వ్యక్తం చేశారు. షేక్ అలీషా తన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ను యువగళం పాదయాత్ర సందర్భంగా ముస్లిం నూర్ భాషా దూదేకుల సముదాయానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుండటం హర్షణీయమని చెప్పారు.

## నేడు స్పౌజ్ పింఛన్ల పంపిణీ

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండల వ్యాప్తంగా ఆగస్టు నెల ఒకటో తేదీ నుంచి ఎన్టిఆర్ భరోసా పథకం కింద అదనంగా 55 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు అందిస్తున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. భర్త పింఛన్ తీసుకుంటూ చనిపోతే భర్త పింఛన్ను స్పౌజ్ కేటగిరి కింద (భార్య) వితంతువులకు ఇస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 55 మందికి రూ.2.20 లక్షల వరకు అదనంగా ఖర్చు చేస్తోందని తెలిపారు.

**180 నూతన పెన్షన్లు మంజూరు**

**కొయ్యలగూడెం :** మండలంలో 180 వితంతు పెన్షన్లు నూతనంగా మంజూరయ్యాయని ఎంపిడిఒ తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో వివిధ గ్రామ పంచాయతీల్లో జరగనుందని, లబ్ధిదారులందరికీ పెన్షన్లు అందిస్తామని, సంబంధిత పంచాయతీల్లో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

## ఘనంగా స్కూల్ పీపుల్స్ లీడర్ ఎలక్షన్

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివిఎస్ఎల్. అరుణాదేవి ఆధ్వర్యంలో స్కూల్ పీపుల్స్ లీడర్ ఎలక్షన్స్ జరిగాయి. 117 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణ ఎలక్షన్లు తలపించేలా నిర్వహించారు. కె.మోహిత్ 71 ఓట్లతో స్కూల్ పీపుల్స్ లీడర్గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు సాయిరాం, జయవర్ధన్ జ్యోతి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఎలక్షన్ నిర్వహణపై ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

**వైసిపి నేత అభిషేక్ బాబు**

**ప్రజాశక్తి - టి.నరసాపురం**


అదానీ స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైసిపి యువనేత పెండ్యాల అభిషేక్బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఇప్పటికే అప్పులతో, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటికి, షాపులకు అదానీ కరెంట్ స్మార్ట్ మీటర్లను బిగించడమంటే ప్రజలపై మరింత భారాన్ని మోపడమేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే కరెంట్ బిల్లులు ఒక్క పైసా పెంచబోమని చెప్పి దాదాపు 13 సార్లు పెంచి మాట తప్పారని పేర్కొన్నారు. అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడానికి కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తెచ్చిందని తెలిపారు. ప్రజలందరూ గ్రహించి సార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పేర్కొన్నారు.

## శిథిలావస్థకు వాటర్ట్యాంకు

**ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనలో ప్రజలు**

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

పట్టణ పరిధిలోని మహాత్మా గాంధీ మున్సిపల్ పార్కులో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. ఏ క్షణంలో వాటర్ ట్యాంకు కుప్పకూలి ప్రమాదానికి దారి తీస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం మున్సిపల్ కార్మికులు కృష్ణా జలాలను ట్రాక్టర్ ట్యాంకర్లలో నింపి ఇంటింటికి సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంక్ నేలకూలితే పెనుప్రమాదం సంభవిస్తుందని పలువురు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలమైన వాటర్ ట్యాంక్ను పరిశీలించి జరగబోయే ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వాటర్ట్యాంకు

## సన్లైఫ్ హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాశక్తి - చింతలపూడి**

సన్ లైఫ్ హాస్పిటల్ అత్యాధునిక సౌకర్యాలతో చింతలపూడి ప్రజలకు అందుబాటులో ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్, ప్రత్తిపాడు ఎంఎల్ఎ బూర్ల రామాంజనేయులు అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన సన్ లైఫ్ హాస్పిటల్ను వారు చింతలపూడి మాజీ ఎంఎల్ఎ రాజేష్ కుమార్, వైద్యులు జ్యోత్స్న, మద్దాల చైతన్యకుమార్లతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎలు మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో ఆసుపత్రి ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఉత్తమ బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు

**ప్రజాశక్తి - దెందులూరు**

ఉత్తమ బోధన ద్వారానే ఉపాధ్యాయునికి గుర్తింపు లభిస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, గన్నవరం మాజీ ఎంఎల్ఎ దాసరి బాలవర్ధనరావు అన్నారు. అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి అధ్యక్షతన జీవశాస్త్ర ఉపాధ్యాయని మాగంటి అమరావతి ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పవతి మాట్లాడుతూ అమరావతి విద్యార్థులు పాఠ్యాంశాలను బాగా అర్థవంతంగా బోధించడం ద్వారా మంచి ఫలితాలను సాధించారన్నారు. ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవడానికి ఆమె బోధన దోహదపడిందని తెలిపారు. పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ మాగంటి లక్ష్మి, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, వేలేరు మాజీ సర్పంచి వేములపల్లి శ్రీనివాస్, పెదపాడు ఎంఇఒలు సబ్బితి నరసింహమూర్తి, జె.రవీంద్రలు పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ ప్రతిభ చూపించిన పదో తరగతి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించాలని పాఠశాలకు రూ.లక్ష తన తల్లి చేతులమీదగా విరాళం అందించారు.

## డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

**ఏలూరు సిటీ :** డెంగీ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మోతే వారి తోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస సూచించారు. స్థానిక ఏలూరు అశోక్నగర్ ఏటిగట్టు ప్రాంతంలో గురువారం నిర్వహించిన జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ కారక దోమ మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతుందన్నారు. డ్రమ్ములు, నీళ్ల తొట్టెలు, నూతులు, వర్షపు నీటి నిల్వ ప్రాంతాలు, వాడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, ఫ్లవర్ వాసులు, రుబ్బురోలు, ఫ్రిజ్ వెనుక బాక్స్, ఎయిర్ కూలర్స్ తదిరత ప్రాంతాల్లో పెరుగుతాయని చెప్పారు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. నీటి నిల్వ ప్రాంతాల్లో వాడేసిన ఇంజిన్ ఆయిల్ గాని ఎబెట్ ద్రావణాన్ని కాని పిచికరీ చేయాలని, సాయంత్రం సమయాల్లో కిటికీలు వేసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. డెంగీ, మలేరియా పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చేస్తారని చెప్పారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే అశ్రద్ధ చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, మలేరియా ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ స్వామి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు సునీత రాణి, శానిటేషన్ సెక్రటరీ అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా, మండల పరిషత్ టీచర్లను ఎంఇఒలుగా నియమించాలి

**ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులను ఎంఇఒలుగా నియమించి వారితోనే ఆయా యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను పర్యవేక్షించాలని ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికై వారి అనుకూలత ప్రకారం ఆనాటి ఖాళీల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపాలిటీల్లో వారి ర్యాంకుల ఆధారంగా ఆప్షన్ల ద్వారా ఉపాధ్యాయులుగా విధుల్లో చేరారని, కాని ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులని, వారికి మాత్రమే ఎంఇఒ, డివైఇఒలుగా బాధ్యతలను అప్పగిస్తామని అధికారులు ఏ రకంగా నిర్ధారణ చేస్తారని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు చేయడం లేదని, అందువల్లే ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్కు విఘాతం కలిగించే విధంగా విద్యాశాఖాధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలపై జిల్లా, మండల పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్కు సంబంధించి 72, 73, 74 జిఒలు అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వ అధికారులే సమన్యాయాన్ని పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరించడం సరికాదని, ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకుని ఉమ్మడి సీనియార్టీ ద్వారా మాత్రమే ఎంఇఒ-1 పోస్టుల భర్తీ చేయాలని కోరారు. ఏ యాజమాన్యంలో పనిచేస్తే ఆ యాజమాన్యంలో అధికారులే ఆ పాఠశాలలపై పర్యవేక్షణ చేయాలని, డిడిఒ అధికారులుగా వారికే బాధ్యతలు ఇవ్వాలని కోరారు.

## తాగునీరు, రహదారులకు మొదటి ప్రాధాన్యత

**పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో ఎంఎల్ఎ ధర్మరాజు**

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రెయిన్లకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా గురువారం అప్పారావుపేట, తల్లాపురం, నారాయణపురం, గోపీనాథపట్నం, కైకరం, ఎ.గోకవరం, తిమ్మయ్యపాలెంలో గ్రామ సభలు నిర్వహించారు. నారాయణపురంలో ఎన్టిఆర్, వైఎస్ఆర్ కాలనీ ప్రజలకు తాగునీటి బోరు, టూరింగుపేటలో ప్రధాన కంకర రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించాలని, వైఎస్ఆర్ కాలనీ సి-బ్లాకులో పక్కా డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఎంఎల్ఎకు వినతిపత్రాలు ఇచ్చారు. కైకరంలో మురుగుబోదెల ఆక్రమణ వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన అర్జీలను ఆన్లైన్ చేసి ప్రాధాన్య క్రమంలో పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఆయా గ్రామాల సర్పంచులు ఆంజనేయులు, పసుపులేటి నరసింహారావు, దిడ్ల అలకనంద, పుత్సకాయల విష్ణుమూర్తి, సలగల గోపీ, మిద్దే సత్యవతి, సింహాద్రి శ్రీదేవి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎంపిడిఒ రాజ్మనోజ్, డిప్యూటీ ఎంపిడిఒ చంద్రశేఖర్, పిఆర్ ఎఇ కృష్ణమోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ రామారావు, హౌసింగ్ ఎఇ సతీష్ పాల్గొన్నారు.

## టిడిపి నేత శివరామకృష్ణకు పితృవియోగం



**ఆగిరిపల్లి :** టిడిపి సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి చిట్నేని హనుమంతరావు(84) గురువారం తెల్లవారు జామున ఈదులగూడెం లోని ఆయన స్వగృహంలో వయోభారంతో మృతి చెందారు. హనుమంతరావుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరావు మృతదేహాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షులు ఎన్.వేణు, నీటి సంఘం అధ్యక్షులు ఎ.గోపాలకృష్ణ, ఎన్.సతీష్, ఎ.చందు, జి.గాంధీ, కె.మంగయ్య, టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న ముద్రబోయిన, తదితరులు

## గ్రంథాలయానికి కంప్యూటర్లు బహూకరణ

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

మండల శాఖ గ్రంథాలయానికి శివశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్, శిక్షణా ఫౌండేషన్ బెంగళూరు వారు రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టివి, సెల్ఫోన్ గ్రంథాలయ సంస్థ మాస్టర్ రామకృష్ణకు డిస్టిక్ మాస్టర్ ట్రైనర్ డి.సత్యనారాయణ అందించారు. ఈ సందర్భంగా డి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులు ఈ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

## నిరుపేద ఆర్యవైశ్యులకు ఉచిత సేవలు

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

నిరుపేద ఆర్యవైశ్యులకు తగిన రీతిలో ఉచిత సేవలందిస్తామని, నిరుపేద విద్యార్థులకు స్కాలర్స్ సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ చెప్పారు. టెంపుల్స్ సెంటర్లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నిర్వహించిన పాలకవర్గ సభ్యుల నూతన ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిరుపేదలైన ఆర్యవైశ్యులకు ఉచితంగా కళ్యాణ మండపాన్ని ఇస్తామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో స్థానిక ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యతనిచ్చే పార్టీలతో కలిసి నడుస్తామన్నారు. పాలకవర్గ నూతన అధ్యక్షునిగా కొల్లూరు శ్రీనివాస్, కార్యదర్శిగా సోలస సుధాకర్, మరో 54 మంది కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లూరు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు మాటూరు సుధీర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : సిఐ

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలు సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సిఐ విల్సన్ తెలిపారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం భీమడోలు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సిఐ, భీమడోలు ఎస్ఐ సుధాకర్తో కలిసి విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆటోలను నిలిపారు. అందులోని ప్రయాణికులను ఆర్టిసి బస్సుల ద్వారా ప్రయాణించేందుకు సహకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, వాహన యజమానులు తమ ఆటోల్లో నిర్ణీత సామర్థ్యం మేరకు ప్రయాణికులు ప్రయాణించడానికి అనుమతించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోలు నడపటానికి అవసరమైన అన్ని పత్రాలు తమ వద్ద అందుబాటులో ఉంచుకోవాలని, తనిఖీల సమయంలో అధికారుల డిమాండ్ మేరకు చూపాలని కోరారు.

## నోటు పుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

మండల పరిధిలోని పాత రావిచర్ల మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి, హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ మరీదు శివరామకృష్ణ ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ స్కూల్ హెచ్ఎం, విద్యా కమిటీ ఛైర్మన్ కోరిక మేరకు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల నోటు పుస్తకాలు పంపిణీ చేశానన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థికి ఏ అవసరం ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ మాజీ ప్రధాన కార్యదర్శి హరిబాబు, జనసేన పార్టీ మండల కార్యదర్శి తోట మల్లేశ్వరరావు, విద్యా కమిటీ ఛైర్మన్ కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించాలని వినతి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ప్రభుత్వ పాఠశాలల్లో కాపలాదారులుగా పనిచేస్తున్న నైట్ వాచ్మెన్ల ఐదు నెలల జీతాల కోసం ఈ నెల నాలుగో తేదీన విజయవాడ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ నైట్ వాచ్మెన్ల కమిటీ జిల్లా కన్వీనర్ కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ నెట్ వాచ్మెన్లకు ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన ధర్నా చేపడుతున్నామని, కార్మికులందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నైట్ వాచ్మెన్ కమిటీ జిల్లా కో కన్వీనర్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ శాఖ ఎఇ బదిలీ

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

జీలుగుమిల్లి గృహ నిర్మాణ శాఖలో ఎఇగా పని చేస్తున్న డి.సీతారాంప్రసాద్ను పోలవరం ఆర్అండ్ఆర్ కాలనీలకు బదిలీ చేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. ఆయన స్థానంలో వంకవారిగూడెం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్గా పని చేస్తున్న పి.హేమంత్కు ఇన్ఛార్జి ఎఇగా బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

## బ్లాంకెట్ సర్వేకు సహకరించాలి

**ప్రజాశక్తి - భీమడోలు**

పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశుసంవర్ధక శాఖ ఈనెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిర్వహించే బ్లాంకెట్ సర్వేకు సహకరించాలని పాడి రైతులను పశుసంవర్ధక శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇకుర్తి సాయిరమేష్ కోరారు. ఈ మేరకు తమ వద్దకు వచ్చే సర్వే బృందానికి 35 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళికి సరైన సమాధానం అందించి సహకరించాలని కోరారు. వర్షాకాలం సీజన్లో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున గురువారం భీమడోలులోని పశు వైద్యశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనితో పాటు ఉచిత వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## 2న చలో ఏలూరు : ఫ్యాప్టో

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన నిర్వహించనున్న చలో ఏలూరు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సకాలం గడుస్తున్నా పేరుకుపోయి ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ ధర్నా కార్యక్రమం చేపట్టామని తెలిపారు.